

# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### కిస్‌మిస్ పండగ

**"కిస్‌మిస్** టీచర్ ఇంట్లో బచ్చాలు చేస్తున్నారు. ఏవీ రమణీ లెక్కలు చెప్పమని వెళ్దాం పా" అని జారిపోతున్న లాగూ పైకి తోసుకుంటూ, ఎప్పుడూ ఎండని జీవనదుల్లాంటి ముక్కుతో సందానీ పరిగెత్తుకొచ్చాడు.

సంవత్సరం అంతా లెక్కలు పిరేడ్ ఎగ్గొట్టే నేను లెక్కల మీద ఇంట్రెస్టు వుందని అంటే ఒప్పుకోదురా టీచర్" అన్నాను దిగులుగా. ఏమేం భక్షాలు చేస్తున్నారో అని మనసులో నాకు దిగులు.

"ఏం కాదు కలేమాక్ తెంపుకు పోదాం. పండగ అంటే కావాలి కదా!" అన్నాడు.

"సరే" అని ఉత్సాహంగా బుర్రవూపి "ఒరే తాబేలు బుర్రా మా ఇంట్లో కరివేపాకుచెట్టు లేదురా!" అన్నాను.

ఓసారి జ్ఞానాంబత్తయ్యా, చిట్టెత్తయ్యా చాల స్నేహంగా, చెంగు చివర అర్ధరూపాయి ముడేసుకుని దొంగరాముడు సినిమాకెళ్ళి, మొగుళ్ళకి హరికథ కెళ్ళామని చెప్పినప్పుడు, దారిలో వస్తూ వస్తూ "అబద్ధాలు చెప్పొచ్చా వదినా?" అని వాచిపోయేలా గవదలు నొక్కేసుకున్నాక చిట్టెమ్మత్తయ్య చిన్నకూతురు సాయంత్రం ఉప్పుపిండిలోకి కరివేపాకు గోడమీదనుండి కోస్తూ జ్ఞానాంబతయ్యకి కనపడింది. ఇంకంతే..!! పేరిణీ నృత్యం శివతాండవం చేసేసింది జ్ఞానాంబత్తయ్య.

"అదేవిటొదినా, స్నేహంతో నాలుగు రెబ్బలు కరివేపాకు కోసుకుంటే అంతంత మాటలనాలా?" అంది మార్నింగ్ షో సినిమా స్నేహం గుర్తుకు తెచ్చుకుంటూ చిట్టెత్తయ్య.

"నీకా సినిమాలో దొంగరాముడు నచ్చినప్పుడే అనుకున్నాను మీ వంశం తీరే అంతనీ. ఇవాళ నాకంట పడింది. ఇదిలా ఎన్నేళ్ళనుండీ కోస్తోందో నా కరివేపాకు. పెళ్ళీడుకొచ్చిన పిల్ల. బుద్దులిలా వుంటే పెళ్ళెట్టా అవుతుందమ్మా" అని చప్పట్లు చరిచిందావిడ.

"నా కూతురి పెళ్ళి గురించి నీకంత ఆరా దేనికి? మీ సుబ్బులు దీనికన్నా నాలుగేళ్ళు పెద్ద.! అయిందా మరి" చిట్టెత్తయ్య చీర పైకి ఎగ్గట్టింది.

"నా సుబ్బులికేం? కన్నొంకరా? కాలొంకరా?" సాగదీసింది జ్ఞానాంబ.

"అంటే నా కూతురికి ఒక్క రవ్వ మెల్లుందనేగా ఈ ఎత్తిపొడుపు? అది సిరిమెల్ల. కట్టుకున్నవాడికి బోలెడు కలిసొస్తుంది. వెళ్ళిన ఇల్లు అయ్యవారి నట్టిల్లులా వుండదు"

"అంటే మా నాన్నగారు పౌరోహిత్యం చేసారనేగా.!? అయ్యవారి నట్టిల్లు అంటున్నావు. నీ వంశం పూర్వీకులు ఆడపిల్లల్ని పాలఘాట్ లో అమ్ముకునేవారు. నువ్వా అమ్మోయ్యి"

"ఏం కూశావే. నీ జిమ్మడా?"

"నా ఇష్టం వచ్చినట్టు అంటానే బుద్ధి తక్కువదానా!"

ఈ గొడవ జరుగుతుండగా, మగాళ్ళు ఆఫీసులనుండొచ్చారు. వాళ్ళకి ఏం జరిగిందో తెలీలేదు. మధ్యాహ్నం జ్ఞానాంబ చేసిన కందిపచ్చడి చిట్టెత్తయ్య మొగుడికీ, చిట్టెత్తయ్య చేసిన కాకరకాయ తీపి పులుసు జ్ఞానత్తయ్య మొగుడికీ టిఫిన్లలో పెట్టి పంపించారు. ఇప్పుడిలా వాలిసుగ్రీవుల్లా కొట్టుకుంటూ కనిపించారు.

చిట్టెత్తయ్య కొప్పు జ్ఞానాంబ చేతిలోకీ, జ్ఞానాంబ చీర కొంగు చిరిగి చిట్టెమ్మ చేతిలోకి వచ్చింది. అటూ ఇటూ పిల్లలూ, మొగుళ్ళూ పట్టి, టగ్ ఆఫ్ వార్ ఆడితే చిట్టెత్తయ్య మొగుడి మీద జ్ఞానమ్మా, జ్ఞానమ్మ మొగుడిమీద చిట్టెమ్మా వచ్చి ఇసుక బస్తాల్లా పడ్డారు. "చచ్చాం రా బాబూ" అని మగాళ్ళు అరిచి, అసలు గొడవ ఎందుకొచ్చిందో కనుక్కుని "ఓరి మీ అసాధ్యాలు తగలడ? నాలుగు రెబ్బలు కరివేపాకుకి ఇంత యుద్ధమా?" అని చివాట్లు వేసారు.

జ్ఞానాంబత్తయ్య అలిగి పుట్టింటికెళ్ళిపోతే తాపీ మేస్త్రిని పిలిచి వాళ్ళాయన గోడ పొడవు ఇంకో రెండు అడుగులు పెంచించాడు.

పిల్లలు నోట్సులు అందుకోడానికీ, మగాళ్ళు ప్రొద్దుట పూట రేడియో, పేపర్‌లో వచ్చే వార్తలు వినడానికీ అనార్కలీల్లా గోడ దగ్గర నిలబడి మెడెత్తి మాట్లాడుకునేవారు.

ఇంత జరిగాక ఎవరూ ఇంక జ్ఞానాంబత్తయ్య కరివేపాకు జోలికి పోలేదు. రహమాన్ కొట్టుకెళ్ళి కరివేపాకు తెచ్చుకునేవాళ్ళు, రహమాన్ జ్ఞానాంబత్తయ్య దగ్గర కొనుక్కెళ్ళేవాడు. అలాంటిది, సందానీ కిస్‌మిస్ అని పిలిచే క్రీస్తుమణి టీచర్‌కి కోసుకెళ్ళి ఇస్తే ఊర్కుంటుందా? "మా అమ్మమ్మకి చెప్తే పెళ్ళి చేసేస్తుంది" అన్నాను.

"నిజంగా పెళ్ళి చేసేస్తుందా?" సందానీ కిసుక్కున నవ్వి అడిగాడు.

"అవును. మా వాణక్క ఉద్యోగం చేసేటప్పుడు అమ్మమ్మకి చెప్పకుండా ఫ్రెండ్ ఇంటికెళ్ళిందని, వెంటనే పెళ్ళి చేయించేసింది" అన్నాను.

"ఇప్పుడే నువ్వు పెళ్ళి చేసుకోకు. శెలవుల్లల్ల మనం చేపలు పట్టాలి. మా బక్రీకి పిల్ల పుడ్తే దావత్ చేసుకుందాం. ఇమామ్ తాత షెహనాయీ వాయిస్తానన్నాడు. నేను అమ్మీజాన్‌కి అడిగి షేర్వానీ కుట్టించుకుంటా" అని కళ్ళనిండా కలలు నింపుకుని నా పెళ్ళికి తొందర లేదన్నాడు సందానీ.

"ఇంతకీ కిస్‌మిస్ టీచర్ ఇంటికి ఏ వంకతో పోవాలా?" అని నేను ఆలోచిస్తుంటే పేడ గంప ఎత్తుకుని మా ఇంటిలో పనిమనిషి శ్యామలమ్మ వెళ్తూ కనిపించింది.

"ఏవీ రమణీ ఆ గంప నువ్వు ఎత్తుకో పండుగకి పేడనీళ్ళు జల్లుతారు కదా" అన్నాడు ఉషారుగా సందానీ.

"అమ్మో పేడెత్తుకెళ్తే మా అమ్మమ్మ వీపు వాయించేస్తుంది" అన్నా భయంగా.

ఈలోగా సందానీ శ్యామలమ్మని పిలిచి "ఆ పేడ కిస్‌మిస్ టీచర్‌కి ఇవ్వు పాపం పండుగ కదా! నీకు మా మామ జాన్ చెనక్కాయలు తెస్తే ఇంగ్లమ్లు ఏపి ఇస్తా" అని ఆశపెట్టాడు.

"నిజాం నవాబు పరగణా రాసిస్తా అన్నట్లు చెప్పావురా బిడ్డా. అస్సలు ఏసుకునేది చిరుగుల అంగీ అయినా నీదంతా నవాబు దర్జారా!" అని శ్యామలమ్మ నోరంతా తెరిచి నవ్వి "అదేం ఒద్దు. కాశీం అక్కతాననుంచి జరంత వక్కాకు తెచ్చిపెట్టు" అని గంప మా గుమ్మంలో దింపేసింది శ్యామలమ్మ.

సందానీ పరిగెత్తుకుంటూ వెళ్ళి, వాళ్ళమ్మ రొంటికున్న గుడ్డసంచిలో ఆకు కోసం వెతికాడు. ఆమె నిద్రపోతుందనుకున్నాడు. కానీ వాడి చెయ్యి గట్టిగా పట్టుకుని "ఏందిరా? ఉన్నదే అరాకు. అదే కావల్సొచ్చిందా? నీ అయ్య కానీ వక్కాకుకి కూడా ఇవ్వడు" అంది కోపంగా "అబ్బా! జల్దీ ఇవ్వవే. బాపనోళ్ళ ఇంట్లో ఎవరిదో దినం. బోలెడు ఆకులు తీసుకొచ్చి ఇస్తా" అన్నాడు.

"ఏ బాపనోళ్ళురా?" కాశింబీ లేచి కూర్చుంది.

"నాకలచ్చిమీ వాళ్ళ నాన్నది దినం" అన్నాడు.

"వాళ్ళమ్మ ఇంత పెద్దబొట్టు పెట్టుకుని నాకు కళ్ళబడ్డది నిన్న సంతల.." అంది ఆమె.

"అబ్బా! నిన్న కద.. ఇప్పుడు పోయిండు" అన్నాడు.

"ఇప్పుడికిప్పుడు పోవుండేందిరా?" అంది ఆశ్చర్యంగా.

"నెలముందుగాల రిజర్వేషన్ చేసుకోవాల్నా? ఏంది?" వాడికి విసుగొచ్చింది.

"ఓ పని చెయ్యి. జరంత చింతకాయ తొక్కు ఏపించుకురా, జొరం వచ్చినట్టుంది. ఆకు ఇస్తా" అంది ఒళ్ళు విరుచుకుంటూ.

సందానీ చిన్నబోయిన చిల్లుకానీ అంత మొహంతో వచ్చి "ఏవీ రమణీ జరంత చింతకాయతొక్కు ఏపించుకురావే. అమ్మ ఆకు ఇస్తానంది" అన్నాడు.

శ్యామలమ్మ చేతిలో బరువు దింపుకుని అరుగుమీద గుర్రుపెడుతోంది అప్పుడే

నేను "సరే" అని రయ్యిన పరిగెత్తాను. ఆ టైంలో అమ్మమ్మ నిద్రపోతూ వుంటుందసలు. కానీ నా ఖర్మకి వంటగది గడపమీద తలపెట్టుకుని, చెంగు మొహాన కప్పుకుని పడుకుని రెండు కప్పలు వాదించుకుంటున్నట్లు, ప్రశ్నా, జవాబూ తనే చెప్తూ గురకపెడుతోంది.

ఆవిడ్ని దాటుకుని వంటింట్లోకి వెళ్ళి, జాలీ అలమారా తెరిచి, చింతకాయ పచ్చడి జాడీ తెరిచి, కొబ్బరి చిప్ప ఖాళీది చూసి, అందులో పెట్టుకుని వెళ్ళాలంటే, ఆపరేషన్ భగీరథా అంత కష్టం. కానీ సందానీగాడికి మాటిచ్చాను. నేనిది చెయ్యకపోతే, వాడు వేసవి శలవల్లో చెరువుకి తీసుకెళ్ళడు. చేపలు పట్టడం నేర్పించడు.. అందుకే సాహసం చేసి పరికిణీ అంతా దగ్గరకి చేసుకుని అమ్మమ్మ మీదనుండి జంప్ చేస్తుంటే విశ్వనాథ్ గారి సిరిమువ్వల సింహనాదం సినిమాలా అనవసరంగా బోలెడు శబ్దం చేసాయి నా కాలి మువ్వలు.

మొహం మీద చెంగు వుండగానే, "ఎవరదీ?" అని అమాంతం నా కాలి దగ్గర కండ వూడేలా పట్టుకుంది అమ్మమ్మ. ఒకసారి వేసవికాలంలో ఆరుబయట పడుకుంటే, ఓ దొంగ ఆవిడ మెడలో గొలుసు కోసం చెయ్యిపెడితే ఇలాగే పట్టేసింది ఉడుంపట్టు. వాడి మణికట్టు బెణికి ఇప్పటికీ ఒక చేత్తోనే దొంగతనాలు చేసుకుంటూ అవిటి బతుకు బతుకుతున్నాడు పిచ్చి వెధవ పాపం. అమ్మమ్మ పట్టు అలాంటిది.

"అమ్మమ్మా కొంచెం చింతకాయ పచ్చడి కావాలి. సందానీ వాళ్ళమ్మకి వాంతులవుతున్నాయి" వీలైనంత జాలిగా మొహం పెట్టి చెప్పాను.

"ఒసి దీని మొహం తగలెయ్య. మొగుడంటే కోపం అంటుంది. చిన్నిల్లు పెట్టాడని తిట్టిపోస్తుంది. మళ్ళీ వాంతులవుతున్నాయా?" అని లేచి కూర్చుంది అమ్మమ్మ.

అసలు వాళ్ళమ్మ వాంతుల్లో, వాళ్ళ నాన్న విషయం ఎందుకొచ్చిందో నాకు అర్థంకాలేదు. "మరే" అన్నాను.

"మరే ఏవిటి మరే? పెద్ద ఆరిందాలా? వెళ్ళి వెళ్ళి అనసూయా వాళ్ళమ్మని పిలుచుకురా ఈలోగా పచ్చడి తీస్తాను" అంది.

"ఇప్పుడివ్వరాదూ?" విసుగ్గా అన్నాను.

"మడి కట్టుకోవద్దూ?" అరిచింది.

ఇంకాస్త లాగితే మొదటికే మోసం అని అనసూయావాళ్ళింటికి పరిగెత్తాను. అనసూయ తల్లి చేటకి కాయితాలూ మెంతులూ రుబ్బి పూస్తోంది. "రావే సమయానికొచ్చావ్. వరలక్ష్మమ్మ ఇంటికెళ్ళి కొత్తపత్రికొచ్చిందట తీసుకురా. మాలతీచందూర్ గారి ప్రశ్నలూ జవాబులు చదవాలి" అంది.

"నువ్వు మా ఇంటికెళ్ళు అర్జెంటుగా అమ్మమ్మ నిన్ను వేడివేడిగా తీసుకు రమ్మంది. ఆరిపోతే కష్టం" అన్నాను.

"నన్ను వేడివేడిగానా?" ఆవిడ ఆశ్చర్యపోయింది.

"మీ ఇద్దరూ వేడివేడి కబుర్లు చెప్పుకుంటారని అమ్మ అంటుందిగా"

"నిజమేనేవ్ నువ్వు పెద్దయ్యాకా రచయిత్రి అవుతావు. గమ్మునెళ్ళి పత్రిక తెచ్చిపెట్టు. ఈలోగా ఈ చాటల పని చూసేసి అలాగే వస్తాను" అంది.

నేను కాళ్ళీడ్చుకుంటూ వరలక్ష్మత్తయ్య ఇంటికి వెళ్ళాను. ఆవిడ నన్ను చూడగానే "ఒసే ఒక్కమాటు ఆ అటకెక్కి లడ్డూల గరిటలు అందుకో నిచ్చెన ఎక్కాలంటే కళ్ళు తిరుగుతున్నాయి" అంది.

నేను నడ్డిమీద చేతులు పెట్టుకుని "ముందు కొత్త పత్రిక ఇస్తే అనసూయా వాళ్ళమ్మకి ఇవ్వాలి. ఆ తర్వాత మళ్ళీ వస్తా" అన్నాను.

"నువ్వు గరిటలందిస్తే అరిగిపోతావా? పత్రిక లేదూ ఏం లేదూ పో" అని కసిరిందావిడ.

"అయ్యో తెస్తానత్తయ్యా" అని గబగబా నిచ్చెనెక్కి రెండు పెద్ద రాకాసి గరిటెలు తీసి అందిస్తూ "ఒక్కనాడైనా లడ్డూలు చేసావా? నీకెందుకీ గరిటలూ?" అన్నాను.

"నీ పెళ్ళికి" అని నవ్వింది. ఆవిడిచ్చిన వారపత్రిక పట్టుకుని రయ్యిన పరిగెడ్తుంటే, కుక్కలత్తమ్మ కుక్క చెయిన్ తెంపుకునొచ్చి నా వెంట పడింది. నేనింకా స్పీడ్‌గా పరిగెత్తాను. అది నిమిషంలో విఠలాచార్య సినిమాలో హీరో రాజనాలయినట్లు పులిలా మారి నా పిక్కట్టుకుంది. దాంతో నేను లబోదిబో. నలుగురూ పోగయ్యారు. ఏం ఎరగనట్టు ఆ కుక్క 'కుయ్ కుయ్' అంటూ పారిపోయింది.

సందానీ ముక్కు తుడుచుకుంటూ వచ్చి "నీకీ పొట్టమీద పధ్నాలుగు సూదులు పొడుస్తయ్ డాక్టర్ సాబ్. చింతకాయ పచ్చడి తెమ్మంటే ఇక్కడెందుకొచ్చినవ్?" అన్నాడు.

నా చేతిలో వారపత్రిక మీద వాణిశ్రీ మొహం వుండేది ఇందాక. ఇప్పుడు వాణిశ్రీ మొహం స్థానంలో పేడ కడి. సందానీ ఒకటే నవ్వు. "గోడలెక్కక ముందే సినిమా బొమ్మకి పేడ ముద్దలేసినావ్" అని.

నేను పత్రిక చూస్తే వరలక్ష్మత్తయ్య ఏం తిడుతుందోనని భయపడ్తుంటే అమ్మ వచ్చింది. "అయ్యో.. అయ్యో ఏమయిందే తల్లీ?" అని నన్ను లేవదీసి డాక్టర్‌గారింటికి తీసుకెళ్ళింది. ఆయన గాయం పరీక్షించి నాకో సూది, ఒకటో ఎక్కం అంతా వప్పచెప్పుకుంటూ పొడిచారు.

అమ్మమ్మ గుమ్మంలో కనపడగానే "అంతా నీ వల్లే. సందానీ అమ్మకి వాంతులయితే నీకెందుకూ? అనసూయా వాళ్ళమ్మకి ఎందుకు చెప్పాలి? నీ వల్లే కుక్క కరిచింది" అని ఏడ్చాను. కాశింబీ వచ్చి, అక్కడేవున్న శ్యామలమ్మకి రొంటినుండి వక్కాకు ఇస్తూ "అయ్యో, అల్లాకీ మెహర్బానీ, అంత పనేం కాలేదులే జరంత సింతకాయ తొక్కు తినాలనిపించింది అంతనే" అంది.

అమ్మమ్మ "ఇదిగో భరిణలో పెట్టి రెడీగా వుంచాను. అంతేకదా! మంచి మాట చెప్పావు" అంది.

శ్యామలమ్మ పేడ గంప తీసుకెళ్ళి క్రీస్తుమణి టీచర్ ఇంటి ముందేసి, "నీ పండగని ఆ పిల్లలు నీకు పేడ ఇచ్చిరమ్మన్నారు" అని చెప్పింది.

నేను నవారు మంచంలో పడుకుంటే, అనసూయా వాళ్ళమ్మ విసురుతుండగా, అమ్మమ్మ ఎర్రగా నేతితో దిబ్బరొట్టె కాల్చుకొచ్చి పెట్టింది. "ఏవీ రమణీ కిస్‌మిస్ టీచర్ బచ్చాలిచ్చింది.. రా!" అని కిటికీలో నుండి సందానీ సైగలు చేస్తూనే వున్నాడు. కోపంగా ఇంకోవైపుకి తిరిగి పడుకున్నాను. వెధవ బచ్చాల కోసం బొడ్డుచుట్టూ పధ్నాలుగు ఇంజెక్షన్లు మరి.




Post your comments

https://www.youtube.com/watch?v=ERaaX_IulS4

